క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ప్రతిష్ఠోత్సవాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

కలసపాడు : స్థానిక అమ్మవారిశాలలో అమ్మవారి ప్రతిష్ఠ జరిగి 19 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం అమ్మవారి ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్దు నాగరాజ తెలిపారు. తెల్లవారుజామున 5 గంటలకు నగర సంకీర్తన, గణపతిపూజ, నగరేశ్వరస్వామికి, వాసవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలచే లక్ష కుంకుమార్చన, భజనలు, గుడి ఉత్సవం, పవళింపుసేవ, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భవనాశిక్రిష్ణయ్య, భవనాశిపూర్ణచంద్రరావు, జూలాదినారాయణ, తుమ్మలపెంటసత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడి ప్రారంభం

కొండాపురం : మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో శ్రీ లక్ష్మి చెన్న కేశవస్వామి గుడి సోమవారం ప్రారంభించారు. దేవాలయంలో వేదపండితులు జగన్మోహనాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఆటలపై ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాళెం : ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆటలపై ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాజుపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ 17 సంవత్సరాలు పైబడిన మహిళలు, పురుషులు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఆయా సచివాలయాల్లో అందజేస్తే వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ ఈ ఐదు ఆటలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


నేటి నుంచి రాజుపాళెంలో ఆధార్ క్యాంపు

రాజుపాళెం : రాజుపాళెంలోని గ్రామ సచివాలయంలో ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఆధార్‌కు మొబైల్ లింకు, ఈ మెయిల్ ఐడీ లింకు, ఫొటో, ఐరిస్, ఫింగర్ ప్రింట్, పేరు, డేట్ ఆఫ్ బర్త్ మార్పు, జెండర్, డాక్యుమెంట్ అప్‌డేట్, చిరునామా మార్పు, కొత్తగా ఆధార్ కార్డు నమోదు వంటివి చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

దువ్వూరు : మండల పరిధిలోని జిల్లెల్ల సచివాలయం పరిధిలోని పెద్దబాక్రాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు సాయి హర్షితకు ఆత్మీయ సన్మానం



ఆత్మీయ సన్మాన ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న బండారు రఘురామయ్య, పల్లా శేషయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికైన వంకం సాయి హర్షితకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య తెలిపారు. సోమవారం ఆత్మీయ సన్మానానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ హాజరవుతారన్నారు. తొగటవీర క్షత్రియులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండప కమిటీ ప్రధాన కార్యదర్శి పల్లా శేషయ్య, సహాయ కార్యదర్శి చౌడం వెంకట రమణ, సభ్యులు గంజికుంట ఆంజనేయులు, పల్లా శంకర నారాయణ, ఉమ్మడిశెట్టి చౌడయ్య, ఉమ్మడిశెట్టి లక్ష్మినారాయణ, పుల్లగూర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- టీడీపీ హయాంలో అవినీతి రాజ్యమేలింది
- పరిపాలనను భేరీజు వేసుకొని ఆదరించండి
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకల ద్వారా సంక్షేమ ఫలాలు రాష్ట్రంలోని ఇంటింటికి అందుతున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మైదుకూరు మున్సిపాలిటీలోని 23వ వార్డులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని కృష్ణాపురం, కృష్ణాపురం ఎస్సీ కాలనీ, భూమాయపల్లె, భూమాయపల్లె ఎస్సీ కాలనీల్లో ఆయన ఇంటింటికి తిరిగి వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 129 హామీలను ఇచ్చారని, వాటిలో 123 హామీలను అంటే 95 శాతం హామీలను నెరవేర్చారన్నారు. హామీలు ఇవ్వకపోయినా ఎన్నో పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు అందించారని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఏదైనా ప్రభుత్వ పథకం అందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసు చేయాల్సిందేనన్నారు. తమ పార్టీకి మద్దతుగా ఉన్న వారికే జన్మభూమి కమిటీలు పథకాలను అందించాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ కులమతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నామన్నారు. మహిళలకు పథకాలు, పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన సాధించి లక్షాధికారులు కావాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి ధ్యేయంగా కోట్లాది రూపాయలతో పనులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. టీడీపీ హయాంలో మైదుకూరు మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. తమ హయాంలో ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. టీడీపీ హయాంలో అభివృద్ధి ఏమి జరిగింది, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఏమి జరిగింది అన్న విషయం బేరీజు వేసుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని కోరారు. భూమాయపల్లె, ఎస్సీ కాలనీ, కృష్ణాపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, భూ సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మాజీ ఎంపీటీసీ బీఎల్ రఘురామయ్య, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యుడు భూమిరెడ్డి నరసింహులు, బీఎల్ రామ్మోహన్, ఏసీకే వెంకటరమణ, ఏసీకే చెంద్రాయుడు, భూమిరెడ్డి చిన్నబ్బి, కూశెట్టి పుల్లయ్య, సాంబశివ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు దండు సుబ్బయ్య, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేష్టాది రవి, పత్తూరు వీరభద్రుడు, సన్న శ్రీనురావు, పిల్లి నాగయ్య, కౌన్సిలర్ వెంకటేష్, ఖాదర్, కందనూరు షరీఫ్, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, ఏఓ లక్ష్మిప్రసన్న, ఎంఈఓ పద్మలత, ఏఈలు నిరంజన్‌రెడ్డి, రామభద్రయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని వనంపుల పంచాయతీలో గల గోపాలపురం, రంగాపురం, బాలాయపల్లె గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకంలో కోత విధించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బిజివేముల లక్ష్మీదేవిరామసుబ్బారెడ్డి, వైస్‌ఎంపీపీలు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, పంచాయతీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఓబులేసు, ఎంపీడీఓ నూర్జహాన్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం



దభోల్కర్ కరపత్రాలను విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

బద్వేలు అర్బన్ : మూఢనమ్మకాలు లేని సమాజ నిర్మానానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎ.డి.దేవదత్తం పేర్కొన్నారు. జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రముఖ హేతువాది, సామాజిక ఉద్యమవేత్త నరేంద్రఅచ్యుత దభోల్కర్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకవైపు చంద్రయాన్–3 ప్రయోగం విజయదరహాసం చేస్తుంటే మరోవైపు సైన్స్ వ్యతిరేక శక్తులు దుష్ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. మన చుట్టూ ఉన్న అనేక సమస్యలకు సైన్స్ వల్లనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రశ్నించేతత్వం పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే సమాజంలో అపోహలు, మూఢనమ్మకాలు నశిస్తాయని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మాదిరిగా మన రాష్ట్రంలో కూడా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి మూఢనమ్మకాలను నిషేధిస్తూ చట్టం తేవాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వి.సుబ్బారెడ్డి, జనవిజ్ఞానవేదిక నాయకులు నజీంబాషా సత్యరాజ్, రెడ్డివరప్రసాద్, ప్రసన్నకుమార్, విజయభారతి, శివప్రసాద్, రమేష్‌రాజ, శాంతి, ఓబయ్య, వెంకటసుబ్బయ్య, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నాగరాజ

గోపవరం : మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ సమీక్షించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించి వాటిని వేగవంతం చేయాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అలాగే వర్షాభావ పరిస్థితుల కారణంగా వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి, సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి ఆర్బీకే కేంద్రంలో అవసరమైన ఎరువులన్నీ సిద్ధంగా ఉంచాలన్నారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి ఆయా సచివాలయాల్లో ఇప్పటి వరకు ఎంత మంది తమ పేర్లను నమోదు చేయించుకున్నారో వివరాలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్పందనలో ప్రజలు ఇచ్చే అర్జీలను స్వీకరించారు. సమావేశంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవిందనాయక్, ఈఓపీఆర్‌డీ హసీనా, పశువైద్యాధికారి క్రిష్ణవేణి, సీహెచ్ఓ గౌస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం



సమీకృత వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వీరయ్య

బద్వేలు అర్బన్ : సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో సోమవారం సమీకృత వ్యవసాయ పద్ధతులపై ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ విధానాలను రైతులు స్ఫూర్తిగా తీసుకుని నికర ఆదాయం లభించే పంటలను సాగు చేయాలన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల అనుభవాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని రైతులు ముందుకు సాగాలని కోరారు. అంతేకాకుండా వనరులు సంరక్షించుకుంటూ సేంద్రియ ఎరువులు వాడటం ఉత్తమమన్నారు. అనంతరం సేంద్రియ వ్యవసాయ, సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సాయిమహేశ్వరి, మహేష్ బాబు, స్వామిచైతన్య, వాటర్‌షెడ్ పీఓ వేణుగోపాల్‌రెడ్డి, చింతలచెరువు సర్పంచ్ వేణుగోపాల్, ఉప సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం బద్వేలు పట్టణంలోని పీసీఎస్ ఆగ్రో ఏజెన్సీస్ దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. స్టాకుకు సంబంధించిన రిజిస్టర్లు, బిల్లు బుక్కు లైసెన్స్‌లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, ధరల వివరాలను, స్టాకు పట్టిక పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులు పంట పూర్తయ్యే వరకు బిల్లు, లాట్ నెంబరును దగ్గర ఉంచుకోవాలన్నారు. ఇచ్చిన విత్తనాలకు సంబంధించి పంట దిగుబడి లేనప్పుడు వినియోగదారుల ఫోరమ్‌ను కూడా ఆశ్రయించవచ్చని రైతులకు విజ్ఞప్తి చేశారు. విత్తనాలు, పురుగు మందులను బద్వేలు మార్కెట్‌యార్డులో ఉన్న సమీకృత నాణ్యత పరీక్షా కేంద్రంలో రైతులు ఉచితంగా పరీక్షించుకోవచ్చన్నారు. పంట నమోదు సమయంలో పంట రకం, పంట దశ వ్యవసాయ సిబ్బందికి వివరించాలన్నారు. డీలర్లందరూ చట్టబద్ధమైన వ్యాపారం చేయాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలను పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను పాటించని జూనియర్ కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆర్ఐఓ రమణరాజును కడపలోని తమ కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని ఓ బాలికల జూనియర్ కళాశాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించకుండా అధిక రుసుము వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయంతం చేయాలి



బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు: ప్రాజెక్టుల పూర్తి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. సోమవారం పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో బస్సు యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు సీపీఐ బస్సు యాత్ర జరుపుతున్నట్లు తెలిపారు. బస్సు యాత్రకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు హాజరవుతారన్నారు. అన్ని వర్గాల ప్రజలు బస్సు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, బాషా, కల్యాణ పాల్గొన్నారు.

నిరంతర సాధనతో విజయం



దావూద్‌ను సన్మానిస్తున్న సాధుగోపాలకృష్ణ, తదితరులు

ప్రొద్దుటూరు క్రైం :విద్యార్థులు నిరంతం సాధన చేయడం ద్వారా విజయాన్ని సొంతం చేసుకోవచ్చని ప్రముఖ నటుడు దావూద్ అన్నారు. స్థానిక వాసవీ కల్యాణమండపంలో సోమవారం జీకే సాధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరుకు చెందిన నటుడు దావూద్ హాజరై ప్రసంగించారు. నిరంతర సాధన, పట్టుదల ఉంటే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా కుంగిపోకూడదని చెప్పారు. ఆత్మవిశ్వాసంతో అవరోధాలపై ఆధిపత్యం సాధించగలిగితే విజయం తథ్యమవుతుందన్నారు. లక్ష్యం కోసం పట్టువదలని విక్రమార్కుడిలా ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం దావూద్‌ను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రమణ్యం, ఆడిటర్ సాధుగోపాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా జరగాలి



చిన్నగోపవరంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : ఖరీఫ్ సీజన్‌లో సాగైన వివిధ పంటలకు సంబంధించి ఈ–పంట నమోదు పక్కాగా జరగాలని ఏడీఏ ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిన్న గోపవరంలో జరుగుతున్న పంట నమోదుపై వ్యవసాయాధికారి అరవిందనాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. పంట నమోదులో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు. పంట నమోదు ఆధారంగానే బీమా, పంట నష్ట పరిహారం వస్తుందని ఆయన తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పంట నమోదు చేపట్టాలన్నారు. సర్వే నంబర్ ఆధారంగా రైతు పొలంలో ఏ పంట సాగైందనే వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. రైతులు కూడా సాగు చేసిన పంటలకు సంబంధించి వ్యవసాయ సిబ్బందిని కలిసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో వీఆర్ఓ వెంకటేశ్వర్లు, వీఏఏ విజయ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తపాలా శాఖ ఏపీ రాష్ట్ర సర్కిల్ డిప్యూటీ సెక్రటరీ పీఎస్ డేవిడ్ రాజ్, అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీ అజీమ్ బాషా, డివిజన్ సెక్రటరీ డి.సుభాన్, పోస్టుమ్యాన్ డివిజన్ సెక్రటరీ శంకర్ తెలిపారు. స్థానిక హెడ్‌పోస్టాఫీసు కార్యాలయం వద్ద సోమవారం జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌జేసీపీ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్‌పోస్ట్‌మాస్టర్ జె.సుబ్బరాయుడు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ హనీఫ్, డివిజనల్ తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపాలిటీలోని నాలుగో డివిజన్ 33, 34 సచివాలయాల కార్మికులు గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, సులోచనమ్మ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులు పాల్గొని విజయంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.